క్లుప్తంగా

ఘనంగా సింహాద్రి అప్పన్న సంబరాలు



కోలా పట్టుకుని ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

బొబ్బిలి: మండలంలోని కృష్ణాపురంలో సింహాద్రి అప్పన్న సంబరాలను ఘనంగా నిర్వహించారు. శనివారం జరిగిన ఈ సంబరాల్లో రెడ్డి, చుక్క వారి కుటుంబాలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పన్నెండేళ్లకోసారి జరిగే ఈ సంబరాల్లో కోలా పట్టుకుని నృత్యం చేయడం ప్రత్యేకత. సంబరాల సందర్భంగా బంధువులు, స్నేహితులతో గ్రామం సందడిగా మారింది.


వంగరలో 'రన్ ఫర్ జీసస్'



ర్యాలీలో పాల్గొన్న క్రీస్తు విశ్వాసకులు

వంగర: మండల కేంద్రంలో శనివారం 'రన్ ఫర్ జీసస్' కార్యక్రమం నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన చర్చ్ పాస్టర్ల ఆధ్వర్యంలో ఈ శాంతి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఏసుక్రీస్తు బోధనలను విశ్వాసకులకు వినిపించారు. క్రీస్తు సూచించిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని, సేవాభావాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.

వృద్ధులు, దివ్యాంగుల వివరాల సేకరణ



కోనంగిపాడులో వృద్ధుడితో మాట్లాడుతున్న దుర్గారావు

వంగర: వృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్దనే ఓటు వేసేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఈ నేపథ్యంలో 80 ఏళ్లు పైబడిన వృద్ధులు, 40శాతం వైకల్యం కలిగిన దివ్యాంగులను గుర్తిస్తున్నట్లు సెక్టార్ ఆఫీసర్ వై.దుర్గారావు తెలిపారు. మండలంలోని కోనంగిపాడు గ్రామంలో శనివారం ఆయన పర్యటించారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లలేని వృద్ధులు, దివ్యాంగుల వివరాలు సేకరించారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి



పీఓలు, ఏపీఓల శిక్షణలో మాట్లాడుతున్న ఈఆర్ఓ జోషఫ్

రాజాం: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో పీఓలు, ఏపీఓలు కీలకమని, ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేలా చూడాలని రాజాం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎల్.జోషఫ్ సూచించారు. రాజాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీఓలు, ఏపీఓలకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొని మాట్లాడారు. పోలింగ్ విధులు జాగ్రత్తగా నిర్వహించాలని, ఏ సమస్య వచ్చినా వెంటనే ఉన్నతాధికారులు, కేంద్రాల వద్ద ఉన్న పోలీసు సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ బి.సుధాకర్ మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల వద్ద పరిస్థితిని ముందుగానే అంచనా వేయాలని, ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. శిక్షణ తీసుకుంటున్న పీఓలు, ఏపీఓలు తప్పనిసరిగా ఎన్నికల నిర్వహణకు హాజరుకావాలన్నారు. మాస్టర్ ట్రైనీలు టెండర్, చాలెంజ్, ప్రాక్సీ ఓట్ల సమస్యలు, పరిష్కారంపై అవగాహన కల్పించారు. మాక్ పోలింగ్ నిర్వహణ, జనరల్ పోలింగ్ విధానం, మెటీరియల్ సీజింగ్, తదితర ప్రక్రియలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్‌లను ఎలా ఉపయోగించాలో తెలియజేశారు. రాజాం అసిస్టెంట్ ఎన్నికల అధికారి ఎస్.కృష్ణంరాజు, డీటీ ప్రకాష్ శిక్షణను పర్యవేక్షించారు.

బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడిగా మావుడి

మక్కువ: బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎన్నికల పరిశీలకులుగా మక్కువ మండలం జెడ్పీటీసీ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మావుడి శ్రీనివాసరావును నియమిస్తూ శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా శనివారం జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడిగా నియమించడం సంతోషంగా ఉందన్నారు. పార్టీ నాపై ఉంచిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానన్నారు. బొబ్బిలి ఎమ్మెల్యే అభ్యర్థి శంబంగి వెంకటచిన అప్పలనాయుడు గెలుపునకు నా వంతు కృషి చేస్తానన్నారు.



మావుడి శ్రీనివాసరావు

జగనన్న పాలనను ప్రజలు కోరుకుంటున్నారు

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్



ఉంగరాడలో డాక్టర్ తలే రాజేష్‌కి తిలకం దిద్దుతున్న మహిళ

రేగిడి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను ప్రజలు మళ్లీ కోరుకుంటున్నారని రాజాం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ అన్నారు. మండలంలోని వండానపేట, కేఎంవలస, గుళ్లపాడు, ఉంగరాడ, వావిలవలస గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని, మళ్లీ జగన్‌కే ఓటు వేస్తామని మహిళలు ముక్తకంఠంతో చెప్పారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతల హామీలను నమ్మమని అన్నారు. గతంలో చంద్రబాబునాయుడుని గెలిపిస్తే మహిళలకు అన్యాయం చేశారని, మహిళలు అంతా ఈసారి ఎట్టి పరిస్థితుల్లో సైకిలు గుర్తుకు ఓటువేయరని వివరించారు. గడపగడపలో డాక్టర్ రాజేష్‌కు మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్మోహనరావు, జేసీఎస్ కన్వీనర్ కింజరాపు సురేష్, సర్పంచ్‌లు వియ్యపు చక్రపాణి, ముయిద ప్రసన్నలక్ష్మి, గొర్జాన అప్పలనాయుడు, కరణం శ్రీనివాసరావు, కరణం గోవిందరావు, గార రమణ, సవళాపురపు రమేష్‌నాయుడు, వావిలపల్లి చంద్రశేఖర్, ఎంపీటీసీ పిల్లా గౌరునాయుడు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రజాదరణ బాగుంది

రేగిడి: గ్రామాల్లోకి ప్రచారానికి వెళ్లే సమయంలో ప్రజలు తనను ఎంతో ప్రేమగా ఆదరిస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ అన్నారు. రేగిడిలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించారని, ఈ కారణంగా ప్రజలంతా వైఎస్సార్‌సీపీకి నీరాజనం పడుతున్నారని అన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా జై జగన్ అంటూ నినాదాలు చేస్తున్నారని వివరించారు. మహిళల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. ఈ సంక్షేమ పథకాలు ఇలానే కొనసాగాలంటే జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకుంటామని ప్రజలు అంటున్నారని వెల్లడించారు. పార్టీ తనను నమ్మి టిక్కెట్ ఇవ్వడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. ఇంత ప్రజాధరణ కలిగిన పార్టీని ఎక్కడా చూడలేదని, సామాన్య వైద్యుడినైన తనకు పార్టీ టిక్కెట్ కేటాయించడం జగన్‌మోహన్‌రెడ్డి అనుసరిస్తున్న సామాజిక సాధికారతకు నిదర్శనమని తెలిపారు. ఆయనతో పాటు వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్మోహనరావు, జేసీఎస్ కన్వీనర్ కింజరాపు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో చేరికలపై టీడీపీ అసత్య ప్రచారం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాజాం: మండలంలోని కంచరాం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి పలువురు చేరినట్లు టీడీపీ చేస్తున్న ప్రచారం అవాస్తవమని, ఓడిపోతామని తెలిసి టీడీపీ బూటకపు ప్రచారాలు చేస్తోందని వైఎస్సార్‌సీపీ రాజాం రూరల్ అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు, యూత్ అధ్యక్షుడు గెడ్డాపు అప్పలనాయుడు మండిపడ్డారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2014 స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీగా టంకాల పాపినాయుడును ఓటర్లు గెలిపిస్తే పార్టీకి నమ్మకద్రోహం చేస్తూ వెన్నుపోటు పొడిచే పనిలో పడ్డారని ఆరోపించారు. అప్పట్లో తన స్వప్రయోజనాల నిమిత్తం టీడీపీతో చేతులుకలిపి, వైఎస్సార్‌సీపీ కార్యక్రమాలకు హాజరుకాలేదని అన్నారు. అనంతరం 2019 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీలోకి చేరి, ఆపార్టీ తరపున బాహాటంగానే ప్రచారం చేశారని, ప్రజలు తనను, ఎమ్మెల్యే అభ్యర్థిని నమ్మక కంచరాం నుంచి భారీ సంఖ్యలో వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేశారని గుర్తుచేశారు. టీడీపీలో చేరినట్లు ప్రచారం చేస్తున్న మరో నాయకుడు రౌతు రామినాయుడు 2001-06 మధ్యకాలంలో టీడీపీ జెడ్పీటీసీగా కొనసాగారని, అతను అసలు వైఎస్సార్‌సీపీ నాయకుడు కానే కాదని స్పష్టం చేశారు. వారికే కండువాలు వేసి వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరినట్లు ఆ పార్టీ నేతలు ప్రచారం చేసుకోవడం హాస్యాస్పదమన్నారు. టీడీపీ నేతలు వాపును చూసి బలుపు అనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్‌ని భారీ మెజారీటీతో గెలిపించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇస్తామని, నియోజకవర్గ ఓటర్లు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో రాజాం పీఏసీఎస్ చైర్మన్ వాకముల్ల చిన్నంనాయుడు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, పీఏసీఎస్ డైరెక్టర్ జనార్దనరావు, పట్టణ యూత్ అధ్యక్షుడు వంజరాపు విజయ్‌కుమార్, ఒమ్మి వైఎస్సార్‌సీపీ నాయకులు వంగా శ్రీను, గురవాం నాయకులు ఆల్తి సత్యనారాయణ, దోసరి సర్పంచ్ తుల సినాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాక్ పోలింగ్ తప్పనిసరి

- ఎన్నికల సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలి
- అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు: కలెక్టర్ నాగలక్ష్మి



ఎన్నికల సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

బొబ్బిలి: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజు ఉదయం 5.45 గంటలకు మాక్ పోలింగ్‌ను తప్పనిసరిగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. స్థానిక గురుకుల పాఠశాలలో పీఓలు, ఏపీఓలకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ఆమె పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలింగ్ ప్రక్రియలో పాల్గొనే సిబ్బంది విధులు, బాధ్యతలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఎన్నికల కమిషన్ రూపొందించిన వీడియోను ప్రదర్శించారు. గత ఎన్నికలకు ఈ ఏడాది ఎన్నికలకు నిబంధనలు మారాయన్నారు. వాటిని అనుసరించి ఎక్కడా పొరపాట్లు రాకుండా, రీపోలింగ్‌కు తావివ్వకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. పొరపాట్లు, తప్పులకు అవకాశం ఇస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామన్నారు. పోలింగ్ ప్రక్రియ జోరుగా సాగేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఓటరు బూత్‌లోకి వెళ్లి ఓటు వేసి వచ్చేందుకు 7 సెకన్ల సమయం పడుతుందని, అందుకు అనుగుణంగా ఇతర పనులను పూర్తి చేసుకోవాలన్నారు. మాక్ పోలింగ్ జరగకపోతే పోలింగ్ రద్దయ్యే అవకాశం ఉందన్నారు. ప్రతీ పోలింగ్ సెంటర్‌లో పీఓతో పాటు నలుగురు సిబ్బంది ఉంటారన్నారు. సిబ్బంది అందరికీ మూడు విడతల శిక్షణ ఉంటుందన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్, ఆర్డీఓ ఎ.సాయిశ్రీ, నాలుగు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి బోరు మరమ్మతులు




బోరు బాగుచేస్తున్న మెకానిక్‌లు

వంగర: క్లాస్ ప్రోగ్రాంలో భాగంగా గ్రామాల్లో పాడైన తాగునీటి బోర్లను గుర్తించి మరమ్మతులు చేపడుతున్నారు. మండలంలోని మగ్గూరు గ్రామంలో పాడైన తాగునీటి బోరుని శనివారం ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది బాగుచేశారు. స్థానిక సర్పంచ్ పోలిరెడ్డి రమేష్ ఆధ్వర్యంలో బోర్‌మెకానిక్ కళింగ కృపారావు, రామకృష్ణ, వెంకటరమణ బోర్లకు మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాను పునరుద్ధరించారు.

టీకాలే పశువులకు శ్రీరామరక్ష

- గాలికుంటు వ్యాధిపై అప్రమత్తత అవసరం
- నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకం
- ముమ్మరంగా కొనసాగుతున్న వ్యాక్సినేషన్



మర్రివలసలో గాలికుంటు వ్యాధి టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

రామభద్రపురం: పశువులకు సీజనల్ వ్యాధులు సోకకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని పశుసంవర్ధకశాఖ ఏడీ ఎల్.విష్ణు సూచించారు. వాతావరణంలో మార్పులు మొదలవగానే పశువులు గాలికుంటు వ్యాధి బారినపడే అవకాశం ఉంది. సకాలంలో వ్యాక్సిన్ వేస్తే వ్యాధి నుంచి రక్షణ పొందవచ్చు. లేకపోతే పశువులు మృత్యువాత పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో జీవాలకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం ఉచిత టీకాల కార్యక్రమం చేపట్టింది. ప్రస్తుతం డివిజన్ వ్యాప్తంగా అన్ని పశువైద్యశాలల ఆధ్వర్యంలో వ్యాక్సినేషన్ ముమ్మరంగా సాగుతోంది. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జీవాలను కాపాడుకోవాలని సూచించారు.

వ్యాధి లక్షణాలు..

- వ్యాధి సోకిన పశువుల నోటి నుంచి చొంగ కారడం.
- 105 డిగ్రీల జ్వరం వస్తుంది. నోట్లో, కాలి గిట్టల్లో పుండ్లు ఏర్పడటం.
- నెల రోజులు వయస్సు దూడలు, ఈ వ్యాధి ఉన్న పశువుల పాలు తాగితే వ్యాధి సోకి మరణించే ప్రమాదం ఉంది. వ్యాధి సోకిన పశువులు ఎక్కువ సేపు ఎండలో ఉండలేవు.
- దుక్కి దున్నే పశువులు కాళ్ల మట్టలు కదిలిపోతాయి. దీంతో అవి పనిచేయలేవు.

నివారణ ఇలా..

వ్యాధి సోకిన వెంటనే పశువులను గుర్తించి గుంపు నుంచి వేరు చేసి విడిగా కట్టేయాలి. ఇలా చేయకపోతే ఇతర పశువులకు వ్యాధి సోకే ప్రమాదం ఉంది. వెంటనే పశువైద్యుడిని సంప్రదించి వైద్యం చేయించాలి. వ్యాధి సోకక ముందు ఎఫ్ఎండీ వ్యాక్సిన్ వేయించాలి. సోకిన తర్వాత పెన్సిలిన్, యాంటీ ఇస్టమిన్, యాంటీ ఇన్ఫ్లమేటరీ డ్రగ్స్ వాడుతూ నోటిలో, కాలి గిట్టల మధ్య గ్లిజరిన్‌తో శుభ్రం చేసి బోరిక్ పౌడర్ పట్టించాలి. వ్యాధి సోకక ముందే వ్యాక్సిన్ వేయించుకుని జాగ్రత్తపడాలి.

పౌష్టికాహారం పంపిణీపై ఆరా..

బాడంగి: అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకు పౌష్టికాహారాన్ని సక్రమంగా అందజేయాలని సూపర్‌వైజర్ వై.నాగమణి అన్నారు. స్థానిక ప్రాజెక్టు కార్యాలయంలో రామచంద్రాపురం క్లస్టర్ పరిధిలోని సిబ్బందితో శనివారం సమావేశమయ్యారు. ఆయా కేంద్రాల్లో నమోదైన లబ్ధిదారుల సంఖ్య, వారికి అందిస్తున్న బియ్యం, పప్పు, నూనె, గుడ్లు, పాలు, తదితర వివరాలతో ఎస్ఎంపీ నివేదికను కార్యకర్తల నుంచి సేకరించారు. అదే విధంగా వచ్చే నెలకు అవసరమైన సరుకుల ఇండెంట్లు సేకరించి ఉన్నతాధికారులకు నివేదించారు. వేసవి ఎండల నేపథ్యంలో ప్రీస్కూల్ చిన్నారుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

సంక్షేమం, అభివృద్ధే వైఎస్సార్‌సీపీ అజెండా

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలే అజెండాగా సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించేందుకు ప్రజల్లోకి వెళ్లాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పిలుపునిచ్చారు. మున్సిపాలిటీలోని 13,15,16,17,1819 వార్డుల నాయకులు, కార్యకర్తలతో శనివారం బూత్ లెవల్ సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని అభివృద్ధి జగనన్న ప్రభుత్వంలో జరిగిందని, ఈ ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని దిశానిర్దేశం చేశారు. ప్రతీ కార్యకర్త, నాయకులు కష్టపడి పనిచేసి మళ్లీ జగనన్న ప్రభుత్వాన్ని తెచ్చుకుందామన్నారు. ప్రతీ గడపకూ అందిన సంక్షేమ పథకాలను ఓటర్లకు మరోసారి గుర్తుచేయాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, వైస్ చైర్మన్ చెలికాని మురళీకృష్ణ, పార్టీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు, జేసీఎస్ పట్టణ ఇన్‌ఛార్జి రేజేటి ఈశ్వరరావు(విసు), తదితరులు పాల్గొన్నారు.

రూ.4.9 లక్షలతో గ్రావెల్‌రోడ్డు నిర్మాణం



కొత్తగా వేసిన గ్రావెల్ రోడ్డు

రాజాం: మండలంలో గడిముడిదాం పంచాయతీ సీఎస్ఆర్ పురం గ్రామం నుంచి రేగిడి మండలం పనసలవలస వరకు గ్రావెల్ రహదారిని నిర్మించారు. గతంలో ఈ ప్రాంతంలో రోడ్డు లేక గ్రామస్తులు ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎంపీపీ లావేటి సులోచన సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో రూ.4.9 లక్షలు మంజూరు చేసింది. ఆ నిధులతో గ్రావెల్ రోడ్డుతో పాటు రక్షణ గోడ నిర్మాణం చేపడుతున్నట్లు ఎంపీపీ తెలిపారు.

చెక్‌పోస్టులు, పోలింగ్ స్టేషన్ల వద్ద పటిష్ట భద్రత

- ఎస్పీ ఎం.దీపిక



అంతర్ జిల్లా చెక్ పోస్టు వద్ద డీఎస్పీ, సీఐలకు సూచనలిస్తున్న ఎస్పీ దీపిక



మాట్లాడుతున్న సీఐ నాగేశ్వరరావు

బొబ్బిలి: సార్వత్రిక ఎన్నికలను పటిష్టంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ ఎం దీపిక అన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇటీవల పాత బొబ్బిలి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును శనివారం ఆమె సందర్శించారు. అంతర జిల్లా చెక్ పోస్టులు, పోలింగ్ స్టేషన్ల వద్ద భద్రతా ఏర్పాట్లపై డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ ఎం.నాగేశ్వరరావుకు పలు సూచనలు చేశారు. మద్యం, నగదు, ఆయుధాలను అక్రమంగా తరలించేవారిపై కఠినంగా వ్యవహరించాలని, శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. ఓటర్లకు బహుమతులు ఇచ్చి ప్రలోభ పెట్టేందుకు ప్రయత్నించేవారిపై కేసుము నమోదు చేయాలన్నారు.

పోలింగ్ స్టేషన్ల తనిఖీ

మండలంలోని మెట్టవలస, పారాది గ్రామాల్లో ఉన్న పోలింగ్ స్టేషన్లను ఎస్పీ దీపిక తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాలకు వంద మీటర్ల దూరంలో ఓటు హక్కు వినియోగించుకునే వారు మినహా ఎవరినీ అనుమతించరాదన్నారు. కేంద్రాల భద్రతకు ఏమేం చర్యలు తీసుకున్నారో డీఎస్పీ, సీఐలను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఎస్సై జి.లోవరాజు తదితరులున్నారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవు

బొబ్బిలి: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా అల్లర్లు సృష్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ఎం.నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని 15వ వార్డు యాదవ వీధిలో శనివారం రాత్రి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించకూడదని, ఈసీ నిబంధనలను కచ్చితంగా పాటించాలని అన్నారు.

ఎన్నికల ప్రచారాల్లో బాణసంచా కాల్చరాదు

రేగిడి: పార్టీ నాయకులు గ్రామాల్లో ప్రచారానికి వెళ్లే సమయంలో బాణసంచా కాల్చరాదని ఎస్సై ఇ.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలుకు విరుద్ధంగా బాణసంచా కాల్చితే కేసులు నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల నియమావళిని ప్రతీ ఒక్కరూ పాటించాలని కోరారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణే లక్ష్యం



రామభద్రపురం: స్థానిక ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ తిరుమలరావు, ఎస్సై జ్ఞానప్రసాద్



రాజాం సిటీ: గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీఐ మోహనరావు



తెర్లాం: ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై రమేష్

రామభద్రపురం: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని సీఐ తిరుమలరావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులను పరిశీలించారు. భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి సూచనలు చేశారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమస్యాత్మక, అతిసమస్యాత్మక గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పటిష్ట నిఘా ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లో గొడవలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాదాపు అన్ని గ్రామాల్లో బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఆయన వెంట ఎస్సై జ్ఞానప్రసాద్ ఉన్నారు.

గొడవలకు దూరంగా ఉండాలి

రాజాం సిటీ: ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో గొడవలు సృష్టించేందుకు ప్రయత్నించేవారిపై కేసులు నమోదు చేస్తామని, ప్రజలు గొడవలకు దూరంగా ఉండాలని రాజాం టౌన్ సీఐ డి.మోహనరావు అన్నారు. మున్సిపాలిటీ పరిధి సారధి గ్రామంలో శనివారం ఆయన పర్యటించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిపై ప్రజలకు అవగాహన కల్పించారు. పార్టీల పేరుతో దూషణలకు దిగడం, కవ్వింపు చర్యలకు పాల్పడడం వంటివి చేయకూడదని అన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎన్నికల నియమావళి పాటించాలి

తెర్లాం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలని ఎస్సై ఆర్.రమేష్ అన్నారు. తెర్లాం జంక్షన్‌లో శనివారం వాహన చోదకులు, ప్రయాణికులకు ఎన్నికల కోడ్‌పై అవగాహన కల్పించారు. రాజకీయ పార్టీలకు చెందిన మెటీరియల్, ఇతర సామగ్రి వెంట తీసుకుని వెళ్లినపుడు తప్పనిసరిగా అవసరమైన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని అన్నారు. పరిమితికి మించి నగదు తరలిస్తే దానికి తగిన ఆధారాలు చూపించాలని, లేదంటే ఆ నగదుతో పాటు వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. ఆయనతో పాటు హెచ్‌సీ రాజు, సిబ్బంది ఉన్నారు.

సీహెచ్‌సీలో వైద్యుల నియామకం

బాడంగి: మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో గైనకాలజిస్టుగా డాక్టర్ ప్రత్యూష నియమితులయ్యారు. ఇక్కడ గైనకాలజిస్టుగా పనిచేసిన డాక్టర్ అర్చన డీసీఎస్‌గా పదోన్నతిపై చీపురపల్లి ఆస్పత్రికి బదిలీ అయ్యారు. జనరల్ సీఎస్‌గా పనిచేసిన డాక్టర్ కాశీవిశ్వనాథం సాలూరు సీహెచ్‌సీకి బదిలీపై వెళ్లారు. ఆదేవిధంగా కురుపాం ఆస్పత్రి నుంచి ఆర్థోపెడిక్ డాక్టర్ గుణశేఖర్, ఈఎన్‌టీ వైద్యులు ఆషా ఇక్కడకు బదిలీపై వచ్చారు. 50 పడకలతో ఉన్న ఈ ఆస్పత్రిలో ఇంకా జనరల్ సర్జన్, చిన్నపిల్లల వైద్యుడు, కంటి వైద్యులను నియమించాల్సి ఉందని ఆస్పత్రి సిబ్బంది తెలిపారు.